క్లుప్తంగా

256 మందికి కంటి పరీక్షలు

నిడదవోలు: స్థానిక శ్రీరామా ప్రైవేట్ హైస్కూల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. శిబిరంలో 256 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, చిక్కాల రాజా, కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నబత్తుల రామారావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, రామచంద్రరావు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 16వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 09న జరగాల్సిన లోక్‌అదాలత్‌ను ఈనెల 16 తేదికి మార్చామన్నారు. ఎక్కువ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలన్నారు.

చెక్‌పోస్టు వద్ద నిరంతర తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ బాలసురేష్

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు దేవరపల్లి సీఐ కె.బాలసురేష్ తెలిపారు. మంగళవారం జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేవిధంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నామని అందుకు వాహనదారులు, పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. ఆయన వెంట గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రిలో ఎక్స్‌రే విభాగం ప్రారంభం

గోపాలపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే విభాగం, జనరేటర్, బ్లడ్ స్టోరేజీ యూనిట్, జనరల్ ల్యాబ్ విభాగాలను బుధవారం రాష్ట్ర హోం, విపత్తుల శాఖమంత్రి డాక్టర్ తానేటి వనిత, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

గోపాలపురం: సత్యసాయి మంచినీటి ట్యాంకు నిర్మాణంతో గోపాలపురం రజక, బెస్తాపేట ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనున్నట్టు గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక రజక, బెస్త పేటలో మంగళవారం సత్యసాయి మంచినీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు దొమ్మేటి కృష్ణంరాజు, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, రజక సంఘం పెద్దలు పాల్గొన్నారు.

కొవ్వూరు ఎమ్మెల్యే సీటు రామారావుకు కేటాయించాలి

ఉండ్రాజవరం: కొవ్వూరు నియోజకవర్గం జనసేనా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టి.వి.రామారావును ప్రకటించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ చెట్టే సుజనరావు ఆపార్టీ రాష్ట్ర నాయకులను కోరారు. నిడదవోలు నియోజకవర్గ ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం మండలంలో కాల్దారిలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జనసేనా పార్టీకి కేటాయించిన 24 సీట్లుల్లో ఎస్సీ సామాజిక వర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. కొవ్వూరు అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించి, ఆ స్థానంలో టివి.రామారావును పార్టీ అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. లేకపోతే జనసేన పార్టీ మాదిగలకు అన్యాయం చేసినట్టేనన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ముమ్మడి వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

16న రక్తదాన శిబిరం

తాళ్లపూడి: మండల ఆర్య వైశ్య సంఘం ముఖ్య నాయకులు సింహాద్రి జనార్దన రావు సహకారంతో పలు స్వచ్ఛంద సంస్థలు, మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నెల 16 వ తేదీన మోగా రక్త దాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. గోకవరపు బాబులు, జనహిత ప్రతినిధులు గోకవరపు మాణిక్యం, జె.ప్రమోద్ కుమార్, నందన ఫౌండేషన్ ప్రతినిధులు దేవరపల్లి రవి, చంద్ర శేఖర్, దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ప్రతినిధి చిన్నూ తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ మహాజన సభ

దేవరపల్లి: స్థానిక దేవరపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) సాధారణ మహాజన సభ బుధవారం ఉదయం 9 గంటలకు అధ్యక్షుడు కవల శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందని కార్యదర్శి కెవెస్ఎస్ శర్మ తెలిపారు. సంఘ సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

- ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేస్తున్న ఆలయ సిబ్బంది
- నేడు గోలింగేశ్వరుడి దివ్య కల్యాణం



గోలింగేశ్వర స్వామి వారు



సోమేశ్వరస్వామి వారు

నిడదవోలు: మహాశివరాత్రి పర్వదినానికి నియోజకవర్గంలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబవుతున్నాయి. ఏర్పాట్లు అన్ని ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భారీకేడ్లు, తాగునీరు, విద్దీపాలంకరణ తదితర ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలో చారిత్రక ఆలయాల్లో ఒకటైన స్వయంభూ గోలింగేశ్వరస్వామి ఆలయ ప్రాముఖ్యత తెలుసుకుందాం. ఈ ఆలయ స్థల పురాణం ఎంతో ప్రాచుర్యం పొందింది. పురాతన కాలం నుంచి స్వామివారు భక్తుల నిరాజనాలు అందుకుంటున్నారు. పట్టణ నడిబొడ్డున వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వర స్వామి ఆలయం, బాలా త్రిపుర సుందరీ సహిత సోమేశ్వరస్వామి వారి ఆలయం, చినకాశీరేవులో ఉన్న శివాలయాల్లో బుధవారం నుంచి 10వ తేదీ వరకు శివరాత్రి వేడకలు జరగనున్నాయి.

స్వామివారి దివ్య కల్యాణం

పట్టణంలోని గోలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్న శ్రీరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి వార్లకు పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 8న వేకువజామున నుంచే రుద్రాభిషేకాలు, లక్షపత్రిపూజ, లక్షకుంకుమార్చనలు, జాగరణ భక్తజన బృందం వారిచే ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి రోజున రుద్రాభిషేకం చేసుకున్న భక్తులు తెల్లవారుజామున 2 గంటల నుంచి 5 గంటల వరకు ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక దర్శనాలకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తెలిపారు.

గోలింగేశ్వర స్వామి ఆలయ స్థల పురాణం

పట్టణ నడిబొడ్డున ఉన్న స్వయంభూ పురాతన గోలింగేశ్వరస్వామి వారి ఆల స్థల పురాణాన్ని వేద పండితులు చెబుతున్నారు. పూర్వం గోలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణ దట్టమైన పొదలతో ఉండేది. పశువుల కాపరులు తమ పశువులను మేత కోసం ఆ ప్రాంతానికి తోలుకుపోయే వారు. పశువుల్లో ఒక ఆవు తన యజమానికి ఎంత ప్రయత్నించినా పాలు ఇచ్చేది కాదు. పాలు ఇవ్వకపోవడంతో తన పాలేరును అనుమానించేవాడు. ఆవు పాలు ఎందుకు ఇవ్వడం లేదో కనిపెట్టాలని యజమాని ప్రయత్నించాడు. ఒక రోజు పొదల మాటున దాక్కున్నాడు. సాయంత్రం అయ్యే సరికి గోవు(ఆవు) పొదపై నిలబడి తన పొదుగు నుంచి క్షీరమును కార్చుచున్నది. చాటున దాగి ఉన్న యజమాని ఈ దృశ్యాన్ని చూసి ఆర్చర్యపడ్డారు. పొదల ప్రాంతాన్ని తవ్వించగా అక్కడ ఒక అద్భుతమైన శివలింగం బయటపడింది. ఈ శివలింగమే గోలింగేశ్వరస్వామి వారని చరిత్ర చెబుతోంది. నిడదవోలు ప్రాంత ప్రజలకు తమ ఇలవేల్పుగా స్వామివారిని భావిస్తారు. ఈ ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారి, గోలింగేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఏటా మాఘ బహుళ ఏకాదశి నాడు ప్రారంభమై 5 రోజుల పాటు నిర్వహిస్తారు. స్వామి వారికి రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, లక్ష పత్రి పూజలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మలకపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

తాళ్లపూడి: మండలంలో పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. తాళ్లపూడిలోని 20, 21 పోలింగ్ స్టేషన్లు, వేగేశ్వరపురంలోని 25, 26, 27, 28, పెద్దేవంలోని 31, 32, 34, మలకపల్లిలోని 39, 40, 41, 42 పోలింగ్ స్టేషన్ల పరిశీలించారు. సమస్యాత్మక పోలంగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న చిన్న చిన్న లోపాలను సారి చేయాలన్నారు. మండలంలో సమస్యాత్మకంగా ఉన్న వేగేశ్వరపురం, మలకపల్లి పోలింగ్ స్టేషన్ల పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస రావు, ఆర్.ఐ కిశోర్ సచివాలయ సిబ్బంది వున్నారు.

అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- మార్కొండపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం



మార్కొండపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి

చాగల్లు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షులు గంగిశెట్టి వాసు, గూడపాటి శివ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చొటుపల్లి వీరన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

నల్లజర్ల: ఆవపాడు గ్రామంలో జనసేన నుంచి పలు కుటుంబాలు మంగళవారం హోంమంత్రి తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తోటనరేంద్ర, షేక్‌రహీం, షేక్ బాబీ, బదిరెడ్డి ప్రసాద్, గ్రంధిపాం జాను, కండెల్లి రాజేష్, ఈర్లపాటి ప్రసన్న ఉన్నారు.

భద్రతా ప్రమాణాలతోనే ప్రమాదాల నివారణ సాధ్యం

కొవ్వూరు: పరిశ్రమల్లో ప్రతి ఒక్క కార్మికుడు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఆంధ్ర షుగర్స్ లిమిటెడ్ మేనేజర్ ఈవీ కృష్ణారావు పేర్కొన్నారు. 53వ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రకాల భద్రత పరికరాల వినియోగం, విధిలో నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సేఫ్టీ అధికారి కేవీవీ సత్యనారాయణ వివరించారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్)సీహెచ్ సుఖ మహర్షి, ఎలక్ట్రికల్ అడిషనల్ చీఫ్ ఇంజినీర్ జె.రఘు విద్యుత్ పరికరాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



పోతవరం-యర్నగూడెం రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి వనిత, గూడూరి శ్రీనివాస్

నల్లజర్ల: పోతవరంలో మంగళవారం హోంమంత్రి తానేటి వనిత పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకొని పోతవరం-యర్రగూడెం రహదారికి రూ.1.95కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామీణ నీటి సరఫరా విభాగం రూ.1.50 కోట్లతో నిర్మించిన రెండు రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభించారు. అనంతరం రూ.89 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్‌ను మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ గూడూరి శ్రీనివాస్, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపా నాగేశ్వరావు, చిడిపి చింతయ్య, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, పిచ్చుకుల ప్రసాద్, అబ్బూరి బాపిరాజు, పెండ్యాల వీరరాఘవులు, సిరాజుద్దీన్, గంటారవి, ముప్పిడి వెంకటరత్నం, కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల గుండెల్లో జగనన్న

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సింగవరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సింగవరంలో పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీశ్రేణులు

నిడదవోలు రూరల్: పార్టీలకతీతంగా ప్రజలందరికీ పథకాలందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల గుర్తు 'ఫ్యాన్' పేద ప్రజల గుండె చప్పుడని, అందరూ ఫ్యాన్ గుర్తికి ఓటు వేయాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సింగవరం గ్రామంలో సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రూ.17.30 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.7.22 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని శ్రీనివాస్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పెన్మెత్స నిర్మల, ఉపసర్పంచ్ రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముదునూరి జగదీష్ వర్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదింట్లో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- గోపవరం గ్రామంలో ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం
- 86 మంది లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



గోపవరంలో మహిళలకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పేద కుటుంబాలన్నీ ఆనందంగా.. కుటుంబం మొత్తం నవ్వుతూ ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గోపవరం గ్రామంలో రూ.47.24 లక్షలతో నిర్మించి రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను, రూ.5 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్లు ప్రారంభించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. అర్హులైన 86 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామ రూపురేఖలు మార్చడంతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోలేటి శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు, నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, తోలేటి కృష్ణ, వైద్యాధికారి శివాజీ, ఎంపఓ జి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవ చేసే భాగ్యం కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి శ్రీనివాస్

నల్లజర్ల: జగనన్న పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని రాజమహేంద్రవరం పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఘంటావారి గూడెంలో మంగళవారం ఎంపీటీసీ యలమర్తి సూర్యకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇమ్మణ్ణి సత్తిపండు, యలమర్తి వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హోంమంత్రి తానేటి వనితతో పాటు డాక్టరు గూడూరి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తొమ్మండ్రు రమేష్,ఈలప్రోలు చంద్రరావు,మటపర్తి రామకృష్ణ,మట్టారాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఆవపాడులో వైఎస్ ఎంపీపీ అచ్యుత శివాజీ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. రక్షితమంచినీటి పథకాన్ని మంత్రి ప్రాంభించారు. సమావేశంలో గ్రామకమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి(పెద్దకాపు) మద్దూరి నాగేశ్వరావు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమెషీన్ల అందజేత

దేవరపల్లి: పార్ట్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహించిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 20 మంది మహిళలకు కుట్టు మెషీన్లు అందజేసింది. దేవరపల్లి మండలం యర్నగూడెం కేంద్రంగా గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న పార్ట్ ఇండియా సంస్థ ఉచితంగా మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాలను నిర్వహిస్తోంది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకుమంగళవారం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిషోర్ చేతుల మీదుగా కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డి.అచ్యుతరావు, డి.రవీంద్ర, సోమిశెట్టి వెంకట్రావు, పి.డేవిడ్, కె.బాబూరావు, సత్యనారాయణ, అనీల్‌కుమార్, ఫణికిషోర్, దుర్గాభవాని, మహిళలకు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న జగనన్న

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



కొవ్వూరులో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు: ఇచ్చిన మాట ప్రకారం వాగ్దానాలన్నీ అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకుని రావడానికి లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కోరారు. మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. లబ్ధిదారుడిపై రిజిస్ట్రేషన్ ఖర్చుల భారం కుడా పడకుండా స్థానికంగా ఉండే గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఇళ్ల స్థాలాలకు రిజిస్ట్రేషన్ చేయించి అందిస్తున్నామన్నారు. అర్హత ఉంటే చాలు ఏ ఒక్కరి సిఫార్సులు అవసరమే లేకుండా సంక్షేమ పథకాలు ఇంటికి లెచ్చి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ దేశ చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్నీ సంక్షేమ పథకాలు జగనన్న అందించారన్నారు. తహసీల్దార్ కె.మస్తాన్ మాట్లాడుతూ ఇచ్చిన ఇళ్ల స్థలాలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల బాస్కర రావు, కంఠమణి రమేష్ తదితరులు మాట్లాడారు. నాయకులు బత్తి నాగరాజు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గంధం శేషసాయి, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్(బెన్ని), కౌన్సిలర్లు దేవగుప్తాపు ఛాందిని, పత్తివాడ నాగమణి, చీరా అరుణకుమారి, వరిగేటి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రమణారెడ్డి కృషి మరువలేనిది

- కోరుమామిడి గ్రామాభివృద్ధికి రమణారెడ్డి ఎంతో కృషి
- వైఎస్సార్, రమణారెడ్డి విగ్రహాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



వైఎస్సార్, రమణారెడ్డి విగ్రహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు

నిడదవోలు రూరల్: కోరుమామిడి గ్రామాభివృద్ధికి దివంగత మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వింతా వెంకట రమణారెడ్డి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కోరుమామిడిలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సర్పంచ్ వింతా వెంకటరమణారెడ్డి విగ్రహాలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మంగళవారం రావిష్కరించారు. రమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు వైఎస్సార్ కాలనీ వద్ద రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన బస్‌సెల్టర్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ అంబటి గోపమ్మ, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, నాయకులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా హోమ్‌కు బియ్యం అందజేత

కొవ్వూరు: పట్టణంలో మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరుపున మంగళవారం బియ్యం అందజేశారు. కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు సేకరించినట్లు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. అధ్యాపకులు పుష్పాంజలి, రత్న వినోల, కాంచనమాల, సునీత తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

- డాక్టర్ వైఎస్సార్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు



గోపాలపురంలో రైతు రమణారెడ్డి జీడితోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గోపాలపురం: యాజమాన్య పద్ధతుల ద్వారా జీడిమామిడి పంటను అధిక దిగుబడి పొందవచ్చని బాపట్ల డాక్టర్ వైఎస్సార్ జీడీమామిడి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఉద్యాన శాఖ ముఖ్యకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. గోపాలపురంలో జీడిమామిడి పంట సాగులో జాతీయస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత ముప్పన రమణారెడ్డి జీడితోటలను మంగళవారం శాస్త్రవేత్తల బృందం సందర్శించారు. శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీడిమామిడి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులతో పాటు శాస్త్రవేత్తల సూచనలు సలహాలను పాటించి సాగులో అధిక దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత డాక్టర్ స్రవంతి అన్నారు. వీరివెంట బాపట్ల వైఎస్సార్ పరిశోధనా సంస్థ డైరెక్టర్లు రైతులు ఉన్నారు.

కొమ్ముగూడెం వెళ్లి పింఛను అందజేత



రామలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మల్లిక

ఉండ్రాజవరం: ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు వలంటీర్లు ఎంత దూరమైనా వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. మండలంలో ఉండ్రాజవరం సచివాలయం-2కు చెందిన వృద్ధురాలు బి.రామలక్ష్మి తన ఇంటిలో ఫోన్ చార్జింగ్ పెడుతుండగా కరెంట్ షాక్ తగలడంతో ఆమెను తన తమ్ముడు తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంకు తీసుకువెళ్లిపోయాడు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతూ కోలుకుంటుంది. పింఛను తీసుకోవడానికి రాలేకపోవడంతో వలంటీర్ రాపర్తి మల్లిక మంగళవారం కొమ్ముగూడెం వెళ్లి పింఛను అందజేశారు.

నేడు సచివాలయం ప్రారంభం

కొవ్వూరు: పశివేదలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనాన్ని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు బుధవారం ప్రారంభించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.